# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఎన్నికల హామీలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఢిల్లీలో సమావేశమవుతారు.**

**3. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

**4. తెలంగాణలోని శ్రీశైలం ఎడమ కాలువ గట్టు సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.**

**5. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా పుణ్య స్నానాలు ఈరోజుతో ముగుస్తాయి.**

==========================

ఎన్నికల హామీలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో నిన్న జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ మే నెలలోనే 'తల్లికి వందనం' ఇవ్వబోతున్నామని, అన్నదాతా సుఖీభవతో పాటు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు.

-------------------------

హైదరాబాద్ వేదికగా జరిగే బయో ఆసియా సదస్సు-2025ను తెలంగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని అన్నారు. ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ.... హైదరాబాద్‌లో రాబోతున్నాయని.. భారత్‌లోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కేంద్రంగా నగరం మారిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ ఎకానమీగా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఇలా ఉండగా.. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమవుతారు.

---------------------------

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో దేవాలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. నిన్నరాత్రి భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్లు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున 2 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 2 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా లోని భీమవరంలో శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన దేవస్థానం, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్ధారాత్రి నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ సందర్భంగా భీమవరం సోమేశ్వరాలయ కార్యనిర్వహణాధికారి డి. రామకృష్ణంరాజు పాత్రికేయులతో మాట్లాడుతూ క్యూ లైన్‌లోని భక్తుల సౌకర్యార్ధం మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు.

తెలంగాణలో వేములవాడ, కాళేశ్వరం, వరంగల్, కీసరగుట్ట ఆలయాల్లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

మరోవైపు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నిన్న సమర్పించారు. స్వామి వారి దర్శనానంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాలలో పటిష్ట ఏర్పాట్లను చేసినట్లు తెలుపుతూ..

.....వాయిస్.... 32 సెకన్లు

---------------------------

తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా శ్రీశైలం ఎడమ కాలువ గట్టు –ఎస్ఎల్‌బిసి సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలను ఆయన నిన్న ... ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ...

...వాయిస్.. 24 సెకన్లు

---------------------------

ఉత్తరప్రదేశ్ – ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళా పుణ్య స్నానాలు ఈరోజుతో ముగుస్తాయి. జనవరి 13న మొదలైన ఈ కుంభమేళాలో ఇప్పటివరకు పవిత్ర త్రివేణి సంగమంలో 60 కోట్ల మందికి పైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పేర్కొంది. కాగా.. ఈరోజు మహాశివరాత్రి పర్వదినం కావడంతో భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని,అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

---------------------------

అన్నమయ్య జిల్లాలోని గుండాలకోన శివాలయానికి వెళ్లిన భక్తులు ఏనుగుల తొక్కిసలాటలో మృతి చెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతాల్లోని ఆలయాలకు వెళ్లేవారి రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని పోలీసు, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులకు స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారి కుటుంబాలకు ఆయన సంతాపం తెలియజేశారు. మానవుల భద్రత–వన్యప్రాణుల సంరక్షణ అంశాలను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా, ప్రశాతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తీసుకొని వెళ్ళాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని వెళ్లరాదని కలెక్టర్ వివరిస్తూ..

..వాయిస్.. 34 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన అంబర్‌పేట ఫ్లైఓవర్ పై ఈరోజు నుంచి వాహనాలను అనుమతించి కింద రోడ్ల నిర్మాణం, పచ్చదనం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యాక అధికారికంగా ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోల్నాక చర్చి నుంచి ఛే నంబర్, శ్రీరమణ కూడళ్ల మీదుగా నిర్మించిన 1.5 కి.మీ. ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఉన్నతాధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఉష్ణోగ్రతల కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు తెలుపుతూ..

వాయిస్.. 22 సెకన్లు

=====================